క్లుప్తంగా

నేడు వైఎస్సార్‌సీపీ నేతల సమావేశం


కోన రామారావు

పరవాడ: దళాయిపాలెంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ఉదయం 9 గంటలకు మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం జరుగుతుందని మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. విస్తృత స్థాయి సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ పాల్గొంటారని చెప్పారు. సమావేశంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గ్రామ పార్టీ అధ్యక్షులు పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని మండల పార్టీ అధ్యక్షుడు రామారావు కోరారు.

సుబ్రహ్మణ్యస్వామికి విశేష పూజలు


సుబ్రహ్మణ్యేశ్వరస్వామి


సింహాచలం: విజినిగిరిపాలెంలోని ఉమాచంద్ర మౌళీశ్వరస్వామి ఆలయంలో కొలువైన వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామికి మంగళవారం విశేష అభిషేకాలు, పూజలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్ కృష్ణశర్మ పూజలను నిర్వహించారు.

కుక్కల దాడిలో వృద్ధురాలికి తీవ్ర గాయాలు


కుక్కల దాడిలో గాయమైన రాములమ్మ కాలు

పరవాడ: మండలంలో పి.బోనంగి శివారు వి.ఎల్.ఎన్ పురం గ్రామానికి చెందిన కూండ్రపు రాములమ్మ అనే వృద్ధురాలిపై మంగళవారం మధ్యాహ్నం వీధి కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. రాములమ్మ పశువులకు గడ్డి కోసుకొని పశువుల పాక వద్దకు వెళ్తుండగా కుక్కలు మూకుమ్మడిగా దాడి చేసి రాములమ్మ కాలిపై తీవ్రంగా గాయాలు చేశాయి. దీంతో ఆమె గట్టిగా కేకలు వేయడంతో స్థానికులు వచ్చి కుక్కలను తరమడంతో రాములమ్మ ప్రాణాలతో బయట పడింది. తీవ్రంగా గాయపడిన వృద్ధురాలిని పరవాడ పీహెచ్‌సీకి తరలించి మెరుగైన వైద్యం అందించారు. కాగా గ్రామంలో కుక్కలు బెడద అధికంగా ఉన్నప్పటికీ పంచాయతీ అధికారులు వాటి నివారణకు కనీస చర్యలు చేపట్టలేదని ఆరోపిస్తున్నారు.

సబ్సిడీపై వాహనం అందజేత


లబ్ధిదారుడు గుమ్మడి పవన్‌కుమార్‌కు వాహన తాళం అందిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట: ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన(పీఎంఎంఎస్‌వై) పథకం కింద మంజూరైన వాహనాన్ని లబ్ధిదారుడు గుమ్మడి పవన్ కుమార్‌కు అందజేశారు. మంగళవారం సిరిపురం వీఎంఆర్‌డీఏ కార్యాలయం వద్ద కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఆయనకు వాహన తాళం అందించారు. ఈ వాహనం విలువ రూ.20 లక్షలు చేస్తుంది. ఇందులో రూ.12 లక్షలు సబ్సిడీ, రూ.8 లక్షలు బ్యాంకు రుణం మంజూరు చేసిందని మత్స్యశాఖ జేడీ జి.విజయ తెలిపారు.

సత్తాచాటిన ఏఎంసీ జట్లు

విశాఖ స్పోర్ట్స్: డాక్టర్ వైఎస్సార్ యూనివర్సిటీ హెల్త్‌సైన్సెస్ అంతర కళాశాలల గేమ్స్ పోటీల్లో ఏఎంసీ ఫుట్‌బాల్, టెన్నిస్, బాల్ బ్యాడ్మింటన్ జట్లు రన్నరప్‌గా నిలిచాయి. ఈ పోటీలు నెల్లూరులోని నారాయణ డెంటల్ కళాశాలలో జరిగాయి. ఫుట్‌బాల్ జట్టుకు రాహుల్, బాల్ బ్యాడ్మింటన్‌కు శంకర్, టెన్నిస్ జట్టుకు ఆదర్శ్ కెప్టెన్లుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఏఎంసీ ప్రిన్సిపాల్ బుచ్చిరాజు, వైస్ ప్రిన్సిపాల్స్ మన్మథరావు, రాజేంద్ర ప్రసాద్ ఆయా జట్టును అభినందించారు.

ఇంటింటా సంక్షేమం


వెన్నలపాలెంలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న మండల జేసీఎస్ కన్వీనర్ సన్యాసిరావు


రావాడలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న పార్టీ నాయకులు

పరవాడ: పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే సాధ్యమని మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు అన్నారు. వెన్నలపాలెంలో మంగళవారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో భాగంగా గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు ఇంటింటికీ వెళ్లి జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధిని అడిగి తెలుసుకొన్నారు. వారి సమ్మతితో మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను ఇళ్ల పై అతికించారు. సంక్షేమ పథకాలు పూర్తి కాలం అందాలంటే మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిగా గెలిపించుకోవడానికి ప్రజల అండగా నిలవాలని సన్యాసిరావు కోరారు.

- రావాడలో వైస్ ఎంపీపీ బి.నాగేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.
- వాడచీపురుపల్లిలో జగన్ననే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ నాలుగేళ్లుగా అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఎన్నికల్లో జగనన్నకు అండగా నిలవాలని కోరారు.


మహిళకు ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరిస్తున్న దాసరి సత్తిబాబు

ఉత్సాహంగా జగనన్నే మా భవిష్యత్తు

సింహాచలం: జగనన్నే మా భవిష్యత్తు...మానమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని మంగళవారం 93వ వార్డు 491సచివాలయం పరిధిలోని విరాట్‌నగర్‌లో ఘనంగా నిర్వహించారు. వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు దాసరి సత్తిబాబు ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నాలుగేళ్లుగా అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజాభిప్రాయాన్ని సేకరించారు. కార్యక్రమంలో కన్వీనర్లు రమేష్, బండి సత్తిబాబు, శ్రీకాంత్, గృహసారథులు ప్రసాద్, లక్ష్మి, పార్టీ నాయకులు బాబు, అప్పలరాజు, సంతోష్, శంకర్, హర్ష పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన


అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

సబ్బవరం: పరిశ్రమల్లో సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించడం ద్వారా ప్రమాదాలను నియంత్రించవచ్చని సబ్బవరం అగ్నిమాపక అధికారి దిలీప్ కుమార్ అన్నారు. జాతీయ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బాటజంగాలపాలెంలోని క్రీమ్ లైన్ డెయిరీలో సిబ్బందికి మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పరిశ్రమల్లో అగ్నిప్రమాదాలు అధికంగా జరిగే అవకాశం ఉందన్నారు. దీంతో సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. పలు మెళకువలు వివరించారు. అగ్ని ప్రమాదాలను నివారించేందుకు చేపట్టిన పలు విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో లీడింగ్ ఫైర్‌మెన్ కె. అప్పలనాయుడు, డ్రైవర్ ఆపరేటర్స్ సీహెచ్ రమేష్ బాబు, ఫైర్ మెన్ ఎఆర్‌కే శేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా భాగస్వామ్యంతోనే ‘ఉక్కు’ పరిరక్షణ


796వ రోజు దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం కార్మికులు చేస్తున్న ఉద్యమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. కూర్మన్నపాలెం కూడలి వద్ద జరుగుతున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 796వ రోజుకు చేరుకున్నాయి. దీక్ష శిబిరంలో సంస్థకు చెందిన సీఎంఎం, సీఈడీ, సీఆర్‌ఎంపీ తదితర విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజా భాగస్వామ్యంతోనే ఉక్కు పరిరక్షణ సాధ్యమవుతుందన్నారు. ఉక్కును కాపాడుకుంటేనే భవిష్యత్తు ఉంటుందని, కర్మాగార పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సిద్ధం కావాలని సూచించారు. ప్రాణ త్యాగంతో ఏర్పాటైన ఉక్కు పరిశ్రమను కాపాడుకోవడం కోసం ఎలాంటి పోరాటానికైనా సిద్ధం కావాలని కోరారు. ప్రధాని మోదీ అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరును మరింత ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

‘ఉక్కు ప్రైవేటీకరణ ప్రయత్నాన్ని తక్షణమే విరమించాలి’



గుడివాడ అప్పన్నకాలనీలో ప్రచార భేరిని నిర్వహిస్తున్న వామపక్ష నేతలు

అక్కిరెడ్డిపాలెం: కేంద్రప్రభుత్వం విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ప్రయత్నాన్ని తక్షణమే విరమించాలని వామపక్షనేతలు డిమాండ్ చేశారు. 68వ వార్డు గుడివాడ అప్పన్నకాలనీలో మంగళవారం ప్రచార భేరి కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలతో పాటు నిత్యావసర వస్తువుల ధరలు పెంచి పేద, మధ్య తరగతి ప్రజల నడ్డి విరుస్తోందన్నారు. ప్రభుత్వ రంగాన్ని కార్పొరేట్‌లకు ధారాదత్తం చేస్తున్నారని దుయ్యబట్టారు. కేంద్రప్రభుత్వ వైఫల్యాల కరపత్రాలను పంచి పెట్టారు. కార్యక్రమంలో వామపక్షనేతలు రాంబాబు, కసిరెడ్డి సత్యనారాయణ, ఎ.లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

కాలేయ వ్యాధులపై అప్రమత్తత అవసరం

అక్కిరెడ్డిపాలెం: భారతదేశంలో కాలేయ వ్యాధికి ముఖ్యకారణాలు వైరల్ ఇన్ఫెక్షన్లు, ఆల్కహాల్ అని కిమ్స్ ఐకాన్ క్లినికల్ డైరెక్టర్ అండ్ చీఫ్ ఆఫ్ డిపార్ట్‌మెంట్ (గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్) డాక్టర్ చలపతిరావు ఆచంట అన్నారు. ఏప్రిల్ 19 అంతర్జాతీయ కాలేయ దినోత్సవాన్ని పురస్కరించుకొని షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో మంగళవారం కాలేయ వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భారతదేశంలో కాలేయ క్యాన్సర్ అత్యంత ప్రమాదకరమైన హెచ్‌బీవీ, హెచ్‌సీవీ ఇన్ఫెక్షన్లు, దీర్ఘకాలిక మద్యపానం వల్ల వస్తుందన్నారు. కాలేయ వ్యాధి నివారణకు టీకాలు వేయించడం అత్యంత ప్రభావవంతమైన మార్గాల్లో ఒకటిగా చెప్పవచ్చన్నారు. కాలేయ వ్యాధులకు గురైన వారు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకుంటూ, జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

కనకమహాలక్ష్మికి స్వర్ణ పుష్పార్చన


స్వర్ణ పుష్పార్చనలో పాల్గొన్న భక్తులు, సిబ్బంది

దాబాగార్డెన్స్: నగరంలోని బురుజుపేటలోని కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిపించిన ఈ పూజలో అమ్మవారిని 108 స్వర్ణపుష్పాలతో అర్చించారు. పూజలో నలుగురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె. రమేష్‌నాయుడు, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో వెంపలి రాంబాబు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

20న సహస్ర తులసిపూజ : కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 20న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఈవో రమేష్‌నాయుడు తెలిపారు. రూ.1500 పూజా రుసుం చెల్లించి, దంపతులు పూజలో పాల్గొనవచ్చని తెలియజేశారు.

ఆకట్టుకున్న షేడ్స్ ఆఫ్ వైజాగ్


పెయింటింగ్స్‌ను తిలకిస్తున్న సీఎండీ హేమంత్

బీచ్‌రోడ్డు: మన సంప్రదాయలు, సంస్కృతిని ఛాయాచిత్రాలు చాటుతాయని హిందుస్తాన్ షిప్‌యార్డ్ సీఎండీ హేమంత్ ఖత్రి తెలిపారు. ప్రపంచ వారసత్వ దినోత్సవం సందర్భంగా మంగళవారం బీచ్‌రోడ్డులోని హవామహల్‌లో షేడ్స్ ఆఫ్ వైజాగ్ పేరుతో పెయింటింగ్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. ఈ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ మన దేశ సంస్కృతి, రాజుల పాలన, బ్రిటిషల అరాచక పాలనపై చిత్రకారులు గీసిన చిత్రాల ద్వారానే చాలా వరకు తెలుసుకున్నామన్నారు. ఆర్టిస్ట్ నరేష్ మెహతా వైజాగ్‌లో వారసత్వ నిర్మాణాల రూపాలను గీసిన తీరు అద్భుతంగా ఉన్నాయన్నారు. ఈ ప్రదర్శన బుధ,గురువారాల్లో కూడా అందుబాటులో ఉంటుంది. హవామహల్ రాజ మాత మయంక్ కుమారి దేవి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన 10వ తరగతి పరీక్షలు

విశాఖ విద్య: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మంగళవారంతో ముగిశాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖాధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయడంతో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా ప్రశాంతంగా పరీక్షలు జరిగాయి. చివరి రోజైన మంగళవారం ఒకేషనల్ కోర్సు విద్యార్థులకు జరిగిన పరీక్షకు 1,023 మంది నమోదు చేసుకోగా.. 948 మంది హాజరయ్యారు. 92.7 శాతం హాజరు నమోదైనట్లు డీఈవో చంద్రకళ తెలిపారు.

మెగా పీపుల్స్ సర్వేకు ప్రజాదరణ


ముఖ్యమంత్రిని కలిసిన హర్షవర్ధన్ రెడ్డి

ఏయూక్యాంపస్: మెగా పీపుల్స్ సర్వేకు ప్రజాదరణ పెరుగుతోందని జగనన్న సచివాలయం, గృహ సారథి ఉత్తరాంధ్ర కో ఆర్డినేటర్ హర్షవర్ధన్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలో కలిసి ఉత్తరాంధ్ర జిల్లాల వివరాలు వివరించారు. తొమ్మిది రోజులుగా చేపడుతున్న జగనన్నే మా భవిష్యత్తు.. మా నమ్మకం నువ్వే జగన్‌కు ప్రజాస్పందన పెరుగుతోందని వివరించారు. గృహసారథులు, సచివాలయ కన్వీనర్లకు ప్రజలు స్వాగతం పలుకుతున్నారని ముఖ్యమంత్రికి వివరించారు.

భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు

ఈవో త్రినాథరావు


ఏర్పాట్లపై చర్చిస్తున్న ఈవో త్రినాథరావు, ఏసీపీ నర్సింహమూర్తి

సింహాచలం: చందనోత్సవం రోజున భక్తులు ఇబ్బంది పడకుండా ఏర్పాట్లు చేస్తున్నట్టు సింహాచలం దేవస్థానం ఈవో త్రినాథరావు చెప్పారు. ఈనెల 23న చందనోత్సవం పురస్కరించుకుని సింహగిరిపై చేస్తున్న క్యూలైన్లు ఇతర ఏర్పాట్లను ఏసీపీ అన్నెపు నర్సింహమూర్తితో కలిసి ఈవో మంగళవారం పరిశీలించారు. అలాగే ఆలయ నీలాద్రిగుమ్మం నుంచి భక్తులు స్వామిని దర్శించుకునే విధంగా ఏర్పాటు చేసిన ర్యాంపులను పరిశీలించారు. పనులు వేగవంతం చేయాలని సిబ్బందికి సూచించారు. భద్రతాపరమైన ఏర్పాట్లపై ఏసీపీ అన్నెపు నర్సింహమూర్తితో ఈవో చర్చించారు. దేవస్థానం ఈఈ శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

పాత కక్షలతో కొట్లాట

10 మందిపై కేసు నమోదు

సబ్బవరం: మండలంలోని గొల్లలపాలెంలో పాతకక్షల నేపథ్యంలో ఇరువర్గాల మధ్య జరిగిన కొట్లాటపై పోలీసులు 10 మందిపై కేసు నమోదు చేశారు. సీఐ రంగనాథం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కొమ్ము కనకరాజు, వంగలపూడి సంతోష్ మధ్య 70 సెంట్లు గ్రామ కంఠం స్థలానికి సంబంధించి కొన్నేళ్లుగా వివాదం నడుస్తోంది. ఈ నేపథ్యంలో గతవారం జరిగిన గ్రామదేవత అనుపు మహోత్సవంలో ఇరువురి మధ్య వివాదం జరిగింది. ఇదిలా ఉండగా ఈనెల 15న సాయంత్రం గొల్లలపాలెంలో ఉంటున్న సంతోష్ అక్క ఇంటికి కొమ్ము కనకరాజు కుమారుడు నవీన్ అతని స్నేహితులు నాగభూషణం,సాయి, దాసరథితో కలిసి వెళ్లి సంతోష్ అక్కగారి అల్లుడైన సురేష్‌పై దాడిచేశారు. అయితే దాడిచేసిన నలుగురు తిరిగి అనకపల్లి కారులో వెళ్తుండగా విషయం తెలుసుకున్న వంగలపూడి సంతోష్ తన స్నేహితులు కొమ్ము కోటి, బొండా రాజు, కొమ్ము పైడిరాజు, నూకరాజు,ఎ సురేష్‌లు కారును అడ్డగించి దాడిచేసి కొట్టారు. ఒకరిపై ఒకరు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇరువర్గాలకు చెందిన 10 మందిపై మంగళవారం కేసు నమోదు చేసిన్నట్లు సీఐ తెలిపారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఏపీ జేఏసీ అసోసియేట్ చైర్మన్ పేర్రాజు


మాట్లాడుతున్న ఏపీజేఏసీ(అమరావతి) రాష్ట్ర అసోసియేట్ చైర్మన్ ఫణి పేర్రాజు

మహారాణిపేట: జిల్లా ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, గ్రామ/వార్డు సచివాలయాల ఉద్యోగుల సంఘాల కార్యాచరణ సమితి(అమరావతి) జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఎన్‌జీవో హోంలో ధర్నా జరిగింది. ఈ సందర్భంగా ఏపీ జేఏసీ(అమరావతి) రాష్ట్ర అసోసియేట్ చైర్మన్ ఫణి పేర్రాజు మాట్లాడుతూ సీపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే చొరవ చూపి ఉద్యోగ సంఘ నాయకులతో చర్చలు జరిపి.. తమ సమస్యలను పరిష్కరించాలన్నారు. లేకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అమరావతి జేఏసీ కో-చైర్మన్, ప్రభుత్వ వాహనాల డ్రైవర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ పీఆర్సీ, డీఏ ఎరియర్స్‌ను వెంటనే విడుదల చేయాలని కోరారు. జిల్లా చైర్మన్ సత్తి నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఏపీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ఎస్.ఎ త్రినాథరావు, ఏపీ భాషా పండితుల సంఘం జిల్లా అధ్యక్షుడు రామకృష్ణమూర్తి, ఏపీ ప్రజా రవాణా సంస్థ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కె.ఎస్.ఎస్.మూర్తి, కో-ఆపరేటివ్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శారదారావు, ప్రధాన కార్యదర్శి జగదీశ్వరరావు తదితర ఉద్యోగ సంఘ నాయకులు పాల్గొన్నారు.

మట్టికుండ.. చల్లగుండ

- వేసవి వేళ కుండలకు పెరిగిన గిరాకీ
- ఆరోగ్యానికీ మంచిదంటున్న వైద్యులు

సూర్యభగవానుడు ప్రతాపాన్ని చూపిస్తూ విజృంభిస్తున్న వేళ .. గొంతు పొడిబారుతున్న తరుణంలో అమృత భాండంలా ఆదుకుంటోంది మట్టికుండ. మండుటెండలో సాంత్వన చేకూరుస్తున్నది ఈ కుండలోని నీరే. ఈ నీరే ఆరోగ్యానికీ మంచిదని వైద్యులు చెబుతున్నారు. వేలు పోసి కొన్న రిఫ్రిజిరేటర్ కంటే పేదవాడి ఫ్రిజ్‌గా పిలిచే ఈ కుండకే డిమాండ్ ఎక్కువగా ఉంటోంది.


మార్కెట్లో అమర్చిన మట్టి కుండలు


మినరల్ వాటర్‌ను మట్టి కుండ ద్వారా ఇలా..


మట్టి కుండను పరిశీలిస్తున్న కొనుగోలుదారు

దాబాగార్డెన్స్: ఎండల తీవ్రత పెరుగుతుండడంతో మట్టి కుండలకు గిరాకీ పెరిగింది. నగరంలోని అల్లిపురం కుమ్మరవీధి, మెయిన్‌రోడ్డు విశ్వేశ్వరాలయం ఎదురుగా గల కుమ్మరవీధి, పూర్ణామార్కెట్ తదితర ప్రాంతాలు మట్టికుండల అమ్మకాలకు కేంద్రంగా నిలుస్తున్నాయి. ఎండలు రోజురోజుకూ పెరుగుతుండడంతో, వేలు ఖర్చు చేసి ఫ్రిజ్‌లు కొనలేని పేదలు, మధ్యతరగతి వారు మట్టికుండల కొనుగోలుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ఫ్రిజ్‌లోని నీరు కంటే మట్టి కుండలోని నీరే ఆరోగ్యానికి మంచిదని చెబుతుండడంతో ఫ్రిజ్‌లు ఉన్నవారు సైతం మట్టి కుండల కొనుగోలుకు ఆసక్తి చూపిస్తున్నారు.

రోజుకు ఒక్కో కుటుంబం 25 కుండలు తయారు చేసి ఒక్కో కుండను రూ.120 నుంచి రూ.140 వరకు హోల్‌సేల్ ధరలకు విక్రయిస్తున్నారు. తొలివారం వరకు రోజుకు 20 నుంచి 30 లోపే కుండల అమ్మకాలు జరగ్గా, ఈ నెల 5వ తేదీ నుంచి రోజుకు సుమారుగా 50 వరకు మట్టి కుండల విక్రయాలు జరుగుతుండడం విశేషం. వచ్చే నెలలో అమ్మకాలు మరింత పెరిగే అవకాశముందని అమ్మకందారులు చెబుతున్నారు. కుండ సైజును బట్టి ఒక్కోటి రూ.100 నుంచి రూ.300కు విక్రయిస్తున్నారు. దీంతో కుండల తయారీదారులు, విక్రయదారులు తమ ఆదాయం మరింత మెరుగుపడతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

వ్యాపారం కొంత పర్వాలేదు..



గతంలో జనవరి నెల నుంచే కుండల తయారీ పెద్ద ఎత్తున ఉండేది. ఏడాదిలో మూడు నెలలు సీజన్ కాగా మిగిలిన తొమ్మిది నెలలు ఉపాధి వెదుక్కోవాల్సిందే. వేసవి కాలం మూడు నెలలు వ్యాపారం బాగుంటుంది. ఇళ్లల్లో ఫ్రిజ్‌లు ఉన్నవారు కూడా మట్టి కుండలు కొనుగోలు చేస్తున్నారు. ఇప్పుడు పల్లెల్లోనూ ఫ్రిజ్‌లు, కూలింగ్ క్యాన్లు వాడుతుండడంతో కుండల వ్యాపారం కొంత తగ్గినప్పటికీ మట్టి కుండల్లో నీరు తాగడం శ్రేయస్కరమన్న ఉద్దేశంతో మట్టికుండలు కొనుగోలు చేస్తున్నారు. కొంత వరకు పర్వాలేదు.

– నాని, మట్టి కుండల విక్రయదారుడు, కుమ్మరవీధి, 30వ వార్డు

తుప్ప నియంత్రణపై అవగాహన సదస్సు


ప్రతినిధులను సత్కరిస్తున్న సంస్థ జీజీఎం సిన్హా

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీలో రెండు రోజుల పాటు తుప్పు నియంత్రణ, రక్షణపై నిర్వహించిన వర్క్‌షాప్ మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా సంస్థ జీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా మాట్లాడుతూ పరిశ్రమలో తుప్పు నియంత్రించడం ఆవశ్యకతను వివరించారు. తుప్పు నియంత్రణ కోసం ఇతర పరిశ్రమలు అవలంబిస్తున్న ఉత్తమ పద్ధతులను పాటించాలని సూచించారు. వర్క్ షాపు ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న సింహాద్రి ప్రొఫెసర్ శాలివాహం(ఐఐపీఈ డైరెక్టర్ విశాఖ)తో పాటు ఇతర ప్రతినిధులను జ్ఞాపికలతో సత్కరించారు. వర్క్ షాపులో తీర ప్రాంత పరిశ్రమల నుంచి 49 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

అంతర విభాగాల ఫుట్‌బాల్ విజేత మెకానికల్ జట్టు



విశాఖ స్పోర్ట్స్: ఈకో రైల్వే అంతర విభాగాల స్పోర్ట్స్ మేళాలో భాగంగా నిర్వహించిన ఫుట్‌బాల్ పోటీల్లో మెకానికల్ జట్టు విజేతగా నిలిచింది. మంగళవారం రైల్వేఫుట్‌బాల్ గ్రౌండ్‌లో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ఆపరేటింగ్ జట్టుపై ఒక గోల్ తేడాతో విజయం సాధించింది. సెమీస్‌లో ఆపరేటింగ్ జట్టు టీఆర్‌డీ జట్టుపైన, మెకానికల్ జట్టు సివిల్ ఇంజినీరింగ్ జట్టుపైన విజయం సాధించి ఫైనల్స్‌కు చేరుకున్నాయి. క్రికెట్ నాకవుట్ మ్యాచ్‌లో మెకానికల్ జట్టు 56 పరుగుల తేడాతో సిగ్నల్స్ టెలికాం జట్టుపై విజయం సాధించింది. మెకానికల్ జట్టు ఐదు వికెట్లకు 177పరుగులు చేయగా సిగ్నల్స్ టెలికాం జట్టు ఎనిమిది వికెట్లు కోల్పోయి 121 పరుగులే చేసింది.